## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక..



2

- 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు ముగింపు సందర్భంగా...
- సమితిసింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాల గ్రామసభ.
- ముఖ్య అతిథిగా హాజరైన మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి.

వాస్తవాలు పలుకు DD9 వార్త
తెలుగు దినపత్రిక
గురువారం 11-06-2026



# రెండేళ్లుగా రోడ్డెలేదు.. పాలకులకు పట్టేదే లేదు..

**ముంచుకొస్తున్న వర్షా కాలం.. ఘోరంగా వెంకటాపురం-భద్రాచలం రహదారి దుస్థితి.**

- ఓట్లప్పుడు హామీలు.. ఇప్పుడు ప్రజలకు కన్నీళ్లు..
- 50 కిలోమీటర్లకు ఐదు గంటలు.. ఇదేనా అభివృద్ధి..?

3

ముంచుకొస్తున్న వర్షాకాలం... పూర్తికాని వెంకటాపురం–భద్రాచలం ప్రధాన రహదారి వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రెండేళ్లుగా పూర్తికాకుండా ఉన్న వెంకటాపురం–భద్రాచలం ప్రధాన రహదారి సమస్య మరోసారి స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రహదారి పనులు నత్తనడకన సాగుతుండగా, అధికారులు, అధికార పార్టీ నాయకులు, ప్రతిపక్ష నేతలు ఎవరూ ఈ సమస్యపై చిత్తశుద్ధితో స్పందించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ప్రాంతంలో పదుల సంఖ్యలో ఇసుక ర్యాంపులు పెరగడం, వాటి ద్వారా వేల సంఖ్యలో లారీలు నిత్యం రాకపోకలు సాగించడం వల్ల రహదారి మరింత దెబ్బతింటోందని స్థానికులు చెబుతున్నారు. కొందరు రాజకీయ నాయకులకు ఇసుక ర్యాంపుల ద్వారా వచ్చే ఆదాయం ముఖ్యమైందే తప్ప, ప్రజల ఇబ్బందులు పట్టడం లేదని వారు విమర్శిస్తున్నారు.

జూన్ 10 డిడి 9 వార్త వెంకటాపురం.



4

## గంజాయి నిర్మూలనలో ప్రజల సహకారం అవసరం

**పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి.**

- గోదావరిఖని డి-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన పెద్దపల్లి డీసీపీ.
- డి-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారితో కలిసి మొక్కలు నాటిన అధికారులు.



4

## ఇర్సలింగో ఇందలగంగో జాతర మహోత్సవం

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక.. 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు ముగింపు సందర్భంగా...

- సమితిసింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాల గ్రామసభ.
- ముఖ్య అతిథిగా హాజరైన మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డి.




**మణుగూరు.జూన్ 10**
**(డి డి 9వార్త)**

ప్రజా పాలన విజయోత్సవాలు " సందర్భంగా ..సమితి సింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం నాడు సర్పంచ్ కలబోయిన మాధవరావు అధ్యక్షతన "గ్రామసభ"ను ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మణుగూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వంగా రవీందర్ రెడ్డి, సిఐ పాటి నాగబాబు లు హాజరయ్యారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, మండల ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర రావు,

పంచాయతీ కార్యదర్శి జక్కుల అశోక్,పంచాయతీ వార్డు సభ్యులు,ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్,మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ లు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి మరియు సంక్షేమ ఫలాలను ప్రజలకు అందివ్వడం జరిగిందన్నారు. పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గారి సారథ్యంలో సమితి సింగారం గ్రామపంచాయతీలో అనేక అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, పినపాక నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అని వారు స్పష్టం చేశారు.

డీఎస్పీ వంగ రవీందర్ రెడ్డి మాట్లాడుతు ప్రజలు క్రమశిక్షణతో ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని, అలాగే ఎటువంటి మత్తు పదార్థాలకు ఆకర్షితులు కావద్దని అన్నారు.

ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతు ప్రజలు పారిశుద్ధంపై అవగాహన కలిగి ఉండాలని,రాబోయే వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రిన్సిపాల్ మరియు వారి సిబ్బంది, మండలంలోని వివిధ శాఖల అధికారులు అనధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మణుగూరు పట్టణంలో నూతన బస్టాండ్ నిర్మాణం వెంటనే చేపట్టాలి..

- బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా..

**మణుగూరు.జూన్ 10**
**(డి డి 9వార్త)**




పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న మణుగూరు పట్టణంలో నూతన బస్టాండ్ నిర్మించేందుకు గత ప్రభుత్వ హయాంలో అప్పటి పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి, అప్పటి రవాణా శాఖ మంత్రి వర్యులు పువ్వాడ అజయ్ కుమార్ తో భూమిపూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కానీ నేటి వరకు కూడా ఆ పనులను ప్రారంభించలేదని, అందుకు నిరసనగా వెంటనే పట్టణ ప్రజల సౌకర్యం కోసం నూతన బస్టాండ్ నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మణుగూరు మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నాడు మణుగూరు డిప్యూటీ తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో BRS పార్టీ మణుగూరు మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, వట్టం రాంబాబు మరియు పార్టీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీజేపీ కుట్ర రాజకీయాలు..

- మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్య విలువలపై దాడి.
- సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

**మణుగూరు.జూన్ 10**
**(డి డి 9వార్త)**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, గాంధేయవాద భావజాలం కలిగిన మహిళా నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, వివరణ కోరే అవకాశం కల్పించకుండా తిరస్కరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు.

అధికార దుర్వినియోగంతో ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు, రాజ్యాంగబద్ధ సంస్థలను బలహీనపరిచేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికత ఉండాల్సిన సమయంలో ఒక మహిళా నాయకురాలి నామినేషన్‌ను ఏకపక్షంగా తిరస్కరిం




విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై గొప్పలు చెప్పుకుంటూనే మహిళా నాయకత్వాన్ని అణచివేయడం హాస్యాస్పదమని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, ఎన్నికల ప్రక్రియను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలనే ప్రయత్నాలను దేశ ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉన్నారని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఇటువంటి అప్రజాస్వామిక చర్యలకు త్వరలోనే ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నియంతృత్వ ధోరణులను కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.

# పన్నెండేళ్ల చిన్నారి పై అత్యాచారం చేసిన గౌస్ పాషా ను కఠినంగా శిక్షించాలి..

- మాదిగ జేఏసీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్□ గద్దల నాగేశ్వరరావు డిమాండ్.

**మణుగూరు.జూన్ 10**
**(డి డి 9వార్త)**

ఖమ్మం పట్టణంలో చిన్నారి పై జరిగిన అత్యాచారం అత్యంత దారుణమని, ఈ సంఘటనకు బాధ్యుడైన గౌస్ పాషా ను వెంటనే ఉరితియ్యాలని మాదిగ జేఏసీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గద్దల నాగేశ్వరరావు డిమాండ్ చేసారు. వివరాల్లోకి వెళితే ఖమ్మం జిల్లా, తల్లంపాడు గ్రామానికి చెందిన దంపతులు పన్నెండేళ్ల చిన్నారి తో కలిసి ఖమ్మం పట్టణంలో రాపర్తి నగర్ లో G ప్రైడ్ అపార్ట్మెంట్ లో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వేసవి సెలవులు రావడంతో చిన్నారి వాళ్ళ అమ్మమ్మ తాతయ్య ఇంటికి రావడం జరిగింది. అదే అపార్ట్మెంట్ లో ఉంటున్న 42 ఏళ్ల వయసు కలిగిన గౌస్ పాషా అనే వ్యక్తి చిన్నారిని అతని అపార్ట్మెంట్ కు పిలుచుకొని రెండు చేతులు కట్టేసి అత్యాచారం చేసి, అత్యంత హేయంగా ప్రవర్తించి చిన్నారిని అనేక ఇబ్బందులకు గురిచేశాడు. ఇట్టి విషయం బయటకు తెలుస్తుందని బయపడి చిన్నారిని కాళ్ళు,చేతులు కట్టేసి ఐదు ఫ్లోర్ల అపార్ట్మెంట్ పైకి తీసుకెళ్లి పైనుండి కిందకు పడేయ్యడంతో చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. చిన్నారి అవయవాలు అన్నీ విరిగిపోయి చావు బ్రతుకులో ఉంది. ఇంతటి గోరానికి పాల్పడిన కామాంధుడు గౌస్ పాషా ను వెంటనే కఠినంగా శిక్షించి మరలా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.



# పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో అర్జీ -1జియం కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ అవగాహనా సదస్సు

- ముఖ్య అతిధిలు జియం లలిత్ కుమార్,కీర్తికాంత్.

**డిడి9వార్త / రామగుండం జూన్ 11:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డీఐసీ పెద్దపల్లి మరియు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో సింగరేణి ఆర్జీ.1 జియం కార్యాలయంలో పెద్దపల్లి జిల్లా లోని వివిధ పరిశ్రమల ప్రతినిధుల తో పర్యావరణ పరిరక్షణ గురించి, ఘన వ్యర్థ పదార్థాల సేఫ్ డిస్పోసల్, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కీర్తికాంత్, జీఎం డి ఐ సి , పెద్దపల్లి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ సైంటిస్ట్ ఇ. కనకజ్యోతి, ఆర్జీ.1 ఏరియా జనరల్ మేనేజర్ డి లలిత్ కుమార్ పాల్గొని పర్యావరణ పరిరక్షణ గురించి, ఘన వ్యర్థ పదార్థాల సేఫ్ డిస్పోసల్ గురించి, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించి అంతే కాకుండా పర్యావరణ పరిరక్షణను ఇండస్ట్రీస్ భారంగా భావించవద్దని ఆది బాధ్యతగా భావించి మనకు ఉన్న వనరులను పర్యావరణాన్ని కాపాడుతూ ఉపయోగించు కావాలని కోరారు.





# పేద కుటుంబానికి అండగా నిలిచిన వ్యాల్ల హరీష్ రెడ్డి

**డిడి9వార్త / రామగుండం జూన్ 11:**

మాతంగి కాలనీకి చెందిన సింహరాజు శివకుమార్ గత నెల 30న ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. శివకుమార్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి మానవత్వంతో ముందుకు వచ్చి వారి కుటుంబానికి అండగా నిలిచారు.శివకుమార్ పెద్దకర్మ సందర్భంగా మాతంగి కాలనీ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యాల్ల హరీష్ రెడ్డి రూ.10,000ల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ కుటుంబ సభ్యులు తమ కష్టకాలంలో సహాయం చేసిన హరీష్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ తోడుగా ఉంటూ, అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందించడం హరీష్ రెడ్డి ప్రత్యేకత అని స్థానికులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కంకల దేవేందర్, బూరుగు వంశీకృష్ణ, జెట్టి చందు, రాచర్ల సాగర్, వెజ్జ సదన్ పాల్గొన్నారు.

# ఆర్.జి - 1 ఏరియా ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ కార్యక్రమం

- **ముఖ్య అతిథిగా జి ఏం, డి లలిత్ కుమార్.**

**డిడి9వార్త / రామగుండం జూన్ 11:**



రామగుండం ఏరియా 1 ఆధ్వర్యంలో స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ ఇచ్చేందుకు నిర్వహించిన అవగాహన సదస్సు మరియు పేర్ల నమోదు కార్యక్రమం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్జీ 1 ఏరియా జనరల్ మేనేజర్ డీ. లలిత కుమార్

స్థానిక నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే సత్సంకల్పంతో సింగరేణి సంస్థ ఆర్జీ1 ఏరియా స్కిల్ డెవెలప్ మెంట్ సెంటర్ ఆద్వర్యంలో స్థానిక జియం కార్యాలయం దగ్గర గల కమ్యూనిటి హాలు నందు ఉచిత వృత్తి శిక్షణ కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా సోలార్ టెక్నిషియన్, డ్రోన్ టెక్నాలజీ, గ్యాస్ కట్టింగ్ & వెల్డింగ్, కాస్మెటాలజీ, సెల్ ఫోన్ & సిసిటివి (సీసీటీవీ ) రిపేరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ & డిటిపి (డీటీపీ ) డిజైన్ తదితర వినూత్న మరియు ఉపాధి ఆధారిత కోర్సులలో ఉచిత శిక్షణ పొందగోరు అభ్యర్థుల కోసం ఈ ప్రత్యేక సదస్సును ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్జీ 1 ఏరియా జనరల్ మేనేజర్ డీ. లలిత కుమార్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక యువతకు ఉపాధి మార్గాలు చూపడంలో ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా డ్రోన్ టెక్నాలజీ, సోలార్ వంటి ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టామని, నిరుద్యోగులు ఈ ఉచిత శిక్షణా అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలని అభ్యర్థులకు కోర్సుల ప్రాధాన్యతను, భవిష్యత్తులో ఉండే ఉపాధి అవకాశాలను వివరించారు. అలాగే ఇట్టి కోర్సులు నేర్చుకొనుటకు పరిసర ప్రాభవిత గ్రామాల నిరుద్యోగ యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడును. కావున ఇట్టి అవకాశం సద్వినియోగ పరిచుకోవాల్సిందిగా జియం తెలిపారు.ఈ సదస్సులో ఎస్.ఓ టు జియం చంద్రశేఖర్, జివిటిసి (వీటీసీ ) మేనేజర్ మాధవరెడ్డి, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రతినిధి రావుల దామోదర్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ రంగు శ్రీను, ఏ వి జె సి , హెడ్ డోంగ్రీ రాకేష్ టి . వర్క్స్ , పనికంటి రాకేష్ సోషల్ ఇన్నోవేషన్ అసిస్టెంట్ టాస్క్ మేనేజర్ మంథని, సీనియర్ పివోలు శ్రావణ్ కుమార్, హనుమంతరావు తదితరులు పాల్గోన్నారు.ఈ అవగాహన సదస్సుకు రామగుండం పరిసర ప్రాంతాల నుండి నిరుద్యోగ యువతీ యువకులు 400 మంది వరకు అభ్యర్థులు భారీ సంఖ్యలో తరలివచ్చి, తమ పేర్లను ఉత్సాహంగా నమోదు చేసుకున్నారు.



# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలి.

- **పస్రా గ్రామ సభలో సీఐ దయాకర్, ఎస్సై తాజుద్దీన్ పిలుపు**

**గోవిందరావుపేట, జూన్ 10(డిడి 9వార్త)**

పస్రా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం గ్రామ సభ, సర్పంచ్ భూక్య సుమలత అధ్యక్షన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పస్రా సీఐ దయాకర్, ఎస్సై తాజుద్దీన్ హాజరై గ్రామ ప్రజలకు డ్రగ్స్ నిర్మూలన, ట్రాఫిక్ భద్రత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో , డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐ దయాకర్, ఎస్సై తాజుద్దీన్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం రహదారి భద్రతపై అవగాహన కల్పించే 'అరివ్ ఆలీవ్ ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వినియోగించరాదని సూచించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అవగాహనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సీఐ దయాకర్, ఎస్సై తాజుద్దీన్ అధికారికంగా విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుమలత,ఉప సర్పంచ్ సప్పిడి సంజన రెడ్డి, వార్డు సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పత్రికా విలేకరులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ సభలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.






# రెండేళ్లుగా రోడ్డెలేదు.. పాలకులకు పట్టేదే లేదు..

- **ముంచుకొస్తున్న వర్షా కాలం.. ఘోరంగా వెంకటాపురం-భద్రాచలం రహదారి దుస్థితి.**
- **ఓట్లప్పుడు హామీలు.. ఇప్పుడు ప్రజలకు కన్నీళ్లు..**
- **50 కిలోమీటర్లకు ఐదు గంటలు.. ఇదేనా అభివృద్ధి..?**
- **ఇసుక ర్యాంపులకు ప్రాధాన్యం.. ప్రజల ప్రాణాలకు విలువ లేదా..?**

**జూన్ 10 డిడి 9 వార్త వెంకటాపురం.**

ముంచుకొస్తున్న వర్షాకాలం... పూర్తికాని వెంకటాపురం-భద్రాచలం ప్రధాన రహదారి వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రెండేళ్లుగా పూర్తికాకుండా ఉన్న వెంకటాపురం-భద్రాచలం ప్రధాన రహదారి సమస్య మరోసారి స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రహదారి పనులు నత్తనడకన సాగుతుండగా, అధికారులు, అధికార పార్టీ నాయకులు, ప్రతిపక్ష నేతలు ఎవరూ ఈ సమస్యపై చిత్తశుద్ధితో స్పందించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ప్రాంతంలో పదుల సంఖ్యలో ఇసుక ర్యాంపులు పెరగడం, వాటి ద్వారా వేల సంఖ్యలో లారీలు నిత్యం రాకపోకలు సాగించడం వల్ల రహదారి మరింత దెబ్బతింటోందని స్థానికులు చెబుతున్నారు. కొందరు రాజకీయ నాయకులకు ఇసుక ర్యాంపుల ద్వారా వచ్చే ఆదాయం ముఖ్యమైందే తప్ప, ప్రజల ఇబ్బందులు పట్టడం లేదని వారు విమర్శిస్తున్నారు. ప్రతి ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మాత్రమే ప్రజలను గుర్తు చేసుకుంటున్న నాయకులు, ఎన్నికలు ముగిసిన తర్వాత వారి సమస్యలను పూర్తిగా విస్మరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తక్షణ చర్యలు తీసుకుని రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని, లేనిపక్షంలో ప్రజలే రోడ్లపైకి వచ్చి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైతే కేవలం 50 కిలోమీటర్ల ప్రయాణానికి నాలుగు నుంచి ఐదు గంటల సమయం పడుతోందని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు కూడా సకాలంలో వెళ్లలేకపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించిన రోగులు మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండల కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు సకాలంలో చేరుకోలేక విద్యకు ఆటంకం కలుగుతోందని పేర్కొంటున్నారు. ఈ ప్రాంత ప్రజలను ప్రభుత్వం తన లెక్కల్లో లేనట్లుగా వ్యవహరిస్తోందని, కేవలం ఇసుక ర్యాంపుల కోసమే ఈ ప్రాంతాన్ని చూస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాథమిక హక్కైన రవాణా సౌకర్యాన్ని కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని వారు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా స్థానిక రాజకీయ నాయకుల మధ్య ఐక్యత లేకపోవడం కూడా ఈ సమస్య పరిష్కారంలో ప్రధాన అడ్డంకిగా మారిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంకటాపురం-భద్రాచలం ప్రధాన రహదారి పనులను వేగవంతం చేసి ప్రజల కష్టాలకు ముగింపు పలకాలని స్థానికులు కోరుతున్నారు.

# గంజాయి నిర్మూలనలో ప్రజల సహకారం అవసరం

- **గోదావరిఖని డి-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన పెద్దపల్లి డీసీపీ.**
- **డి-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారితో కలిసి మొక్కలు నాటిన అధికారులు.**



**డిడి9వార్త / పెద్దపల్లి జూన్ 11:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన వారిలో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిఅడిక్షన్ సెంటర్‌ను పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి సందర్శించారు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డిఅడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న యువకులతో డీసీపీ మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి,చికిత్స విధానం గురించి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ,మత్తు పదార్థాలకు బానిసలైన వారిని గుర్తించి నార్కోటిక్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, పరీక్షల్లో పాజిటివ్‌గా తేలిన వారిని న్యాయస్థానం ఆదేశాల మేరకు 15 రోజుల పాటు డిఅడిక్షన్ సెంటర్‌కు పంపిస్తున్నామని తెలిపారు.అక్కడ వారికి వైద్య చికిత్సతో పాటు మానసికంగా మార్పు తీసుకురావడానికి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

గంజాయి సరఫరా చేసే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, అలాగే గంజాయి సేవించే వారిని గుర్తించి వారిని ఆ అలవాటు నుంచి దూరం చేస్తే సరఫరా కూడా తగ్గే అవకాశముందని డీసీపీ అన్నారు.తల్లి దండ్రులు,పెద్దలు తమ పరిసరాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నా లేదా సేవిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.పోలీసులు స్పందించి నిందితులపై కేసులు నమోదు చేసి నార్కోటిక్ పరీక్షలు నిర్వహిస్తారని, పాజిటివ్‌గా తేలిన వారిని డిఅడిక్షన్ సెంటర్లకు పంపించి చికిత్స అందిస్తామని తెలిపారు. నిపుణులైన వైద్యుల సహాయంతో మత్తు బారిన పడిన వ్యక్తులు తిరిగి సాధారణ జీవితంలోకి వచ్చే అవకాశం ఉందని, డ్రగ్స్ రహిత పెద్దపల్లి జిల్లాను నిర్మించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని డీసీపీ రామ్ రెడ్డి కోరారు.ఈగల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి, నార్కోటిక్ పెద్దపల్లి ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు,వైద్య అధికారులు,సిబ్బంది, గంజాయికి బానిసై డిఅడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారితో కలిసి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా మొక్కలు నాటారు.

# మండల మహాసభను విజయవంతం చేయండి

**జూన్ 10 గుండాల (డిడి9 వార్త).**



ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) గుండాల మండల 6వ మహాసభ మండలంలోని ముత్తాపురం గ్రామంలో ఈనెల 13వ తేదీన జరుగుతుందని ఈ మహా సభకు యువతి,యువకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) గుండాల మండల అధ్యక్ష ,కార్యదర్శులు తాటి రమేష్, కల్తి ప్రమోదు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రగతిశీల యువజన సంఘం ఏర్పడి రెండున్నర దశాబ్దాలు అవుతుందని ఈ కాలంలో యువతి, యువకులను కూడగట్టి రాష్ట్రంలో గుట్కా, మద్యంని రాష్ట్రంలోనిషేధించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని అనేక ఉద్యమాలు నిర్వహించిందని అన్నారు. యువకులను యువజన ఉద్యమాలలోకి సమీకరిస్తున్న సమయంలో పాలకవర్గాలు, మతోన్మాదులు, రౌడీలు, గూండాల దాడులలో పగడాల వెంకన్న ,తుడుం రామన్న, కత్తిరమల్ల పోచన్న, వేములపల్లి కిరణ్ కుమార్, రామదాస్ పున్నయ్య, శంకరన్న లాంటి అనేకమంది అమరులయ్యారన్నారు. వీరి త్యాగాలను స్మరించుకుంటూ భవిష్యత్తు కర్తవ్యాలను ఈ మహాసభ సందర్భంగా రూపొందించుకొని పోరాడుతామన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో విద్యార్థి ,యువకులకు అనేక వాగ్దానాలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనాయని,

ఈ పాలకవర్గ ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడం కొరకు యువకులు ఈ మహాసభకు హాజరై స్ఫూర్తి పొంది ప్రభుత్వ వ్యతిరేకత విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

# మత్తుకు దూరంగా.. కొత్త జీవితానికి చేరువగా

- **డీ-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్**

**భద్రాచలం, జూన్ 10 డిడి9 వార్త**

మత్తు పదార్థాల వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబ వ్యవస్థను, సామాజిక జీవితాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని భద్రాచలం డివిజన్ డీఎస్పీ అరుణ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక డీఅడిక్షన్ సెంటర్‌ను పోలీసు సిబ్బందితో కలిసి సందర్శించిన ఆయన, అక్కడ చికిత్స పొందుతున్న బాధితులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలు, మద్యం మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యసనాల కారణంగా ఆరోగ్యం క్షీణించడమే కాకుండా కుటుంబ బంధాలు దెబ్బతింటాయని, సమాజంలో గౌరవం కోల్పోయే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు.

చికిత్స అనంతరం బాధితులు పాత అలవాట్లను పూర్తిగా విడిచిపెట్టి, ఆత్మవిశ్వాసంతో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని సూచించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, కుటుంబ బాధ్యతలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా డీఅడిక్షన్ సెంటర్ ప్రాంగణంలో డీఎస్పీ అరుణ్ కుమార్, సీఐ నాగరాజు మరియు పోలీసు సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగరాజు, పోలీసు సిబ్బంది, డీఅడిక్షన్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.








# ఇర్సలింగో ఇందలగంగో జాతర మహోత్సవం

- **హాజరైన తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పోదం వీరయ్య**

**జూన్ 10 డిడి9 వార్త దుమ్ముగూడెం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పైడిగూడెం గ్రామంలో ఘనంగా నిర్వహిస్తున్న ఇర్సలింగో ఇందలగంగో జాతర సందర్భంగా బుధవారం నాడు తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్య జాతరను సందర్శించారు. ఈ సందర్భంగా జాతర నిర్వహణ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు ఆదివాసి ప్రజలు పొదెం వీరయ్యను సాంప్రదాయబద్ధంగా మేళ తాళాలు పూర్ణకుంభలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు జాతరలో పాల్గొని దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం పొదెంవీరయ్య మాట్లాడుతూ ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలు ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీకలని అన్నారు ప్రకృతిని ఆరాధిస్తూ అడవులను సంరక్షిస్తూ జీవించే గిరిజనుల జీవన విధానం సమాజానికి ఆదర్శమని వనదేవతలపట్ల గిరిజనులు చూపించే భక్తి ప్రకృతి పట్ల వారి గౌరవభావం పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు ప్రతి ఒక్కరూ తమ సాంప్రదాయాలను సంస్కృతిని కాపాడుకుంటూ ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తల్లం హరికృష్ణ సీనియర్ నాయకులు స్వామి ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు వాసిరెడ్డి సాంబశివరావు గొల్లపూడి వరుణ్ సర్పంచుల సమ్మయ్య కంగాల వెంకటేష్ జాతర నిర్వహణ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# 19వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

- **ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**
- **మున్సిపల్ చైర్ పర్సన్ చింతనిప్పల చంద్రకళ**
- **19వ వార్డు కౌన్సిలర్ ఓం ప్రకాష్**

**ములుగు, జూన్ 10, డీ డీ 9 వార్త :**

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ములుగు మున్సిపల్ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో వార్డు కౌన్సిలర్ ఓం ప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్పర్సన్ తో పాటు మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి, ములుగు డిఎస్పి ఎన్. రవీందర్, మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ వార్డు సభలో భద్రత చర్యల్లో భాగంగా ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, డ్రగ్స్ రహిత జిల్లాగా ములుగును తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తీర్మానించారు. అలాగే వార్డు పరిధిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో మురుగునీరు, వర్షపు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు.



## ప్రజాపాలన ప్రగతిప్రణాళిక 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ముగింపు గ్రామసభ

**జూన్ 10 డిడి 9 వార్త దుమ్ము-గూడెం**

దుమ్ముగూడెం మండలం పర్ణశాల పంచాయతీ ఆఫీస్ నందు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు త్రాగునీటి సరఫరా ఘన వ్యర్థాల నిర్వహణ జల సంరక్షణ మరియు మన సంరక్షణ మొక్కలు పెంపకం వనమహోత్సవం గురించి చర్చ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పర్ణశాల సర్పంచ్ వాగే ఖాదర్ బాబు పంచాయతీ సెక్రెటరీ మరియు ఉప సర్పంచ్ తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు ఈ ముగింపు గ్రామసభ కి వార్డు సభ్యులు ప్రజాప్రతినిధులు టీచర్లు ఫారెస్ట్ అధికారులు పిసొమెగ్లెజర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.



## మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి మాతృమూర్తి మృతి

**జనగామ జూన్10 (డిడి 9వార్త) బ్యూరో**

చేర్యాల మండలం ముస్త్యాల గ్రామ మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి మాతృమూర్తి పెడుతల మల్లమ్మ అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం ముస్త్యాల గ్రామానికి చేరుకుని మల్లమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా మల్లమ్మ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.

## పోలీస్ స్టేషన్ కు 30 బారికేడ్లు విరాళంగా అందించిన సరస్వతి ఐరన్ నిర్వాహకులు.

**మణుగూరు.జూన్ 10 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,మణుగూరులో నాగార్జున సిమెంట్ వారి ఆధ్వర్యంలో మణుగూరు సరస్వతి ఐరన్ నిర్వహకుల సమక్షంలో మణుగూరు పోలీస్ స్టేషన్ కు 30 బారికేడ్లు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా సీఐ నాగబాబు మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియంత్రణకు, ప్రజల భద్రతకు ఈ భారీకేడ్లు ఉపయోగపడతాయని సీఐ తెలిపారు. పోలీసు శాఖకు సహకరించిన దాతలను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగబాబు, సరస్వతి ఐరన్ నిర్వాహకులు పి.వి. ఎన్ రాజు, నాగార్జున సిమెంట్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, కిరణ్ రాజు, జి శోభన్ పాల్గొన్నారు



# ఆనందభాష్పాల అమ్మా నాన్నకు ప్రేమతో

- **అమ్మానాన్నల కష్టానికి పిల్లల 'టాప్' గిఫ్ట్.**
- **టెన్త్ టాపర్లచే వారి తల్లిదండ్రులకు ఘన సన్మానం.**
- **ఎంత ఎదిగినా అమ్మానాన్నలను మరువొద్దు.**
- **ఢిల్లీ స్థాయి బాధ్యతల్లోనూ.. సొంత గడ్డపై ప్రేమ.**
- **విద్యార్థులకు రోల్ మోడల్ 'వడ్డేపల్లి రామచందర్'.**
- **20 ఏళ్ల బంధం.. కష్టకాలంలో తోడు.**
- **పదవులు వస్తాయి.. పోతాయి, మీ ప్రేమే నా ఆస్తి.**
- **కరోనా వేళ నా భర్తే నాకు దేవుడు.**
- **బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి.**



**డిడి9వార్త / రామగుండం జూన్ 11:**

రామగుండం నియోజకవర్గ గడ్డపై భావోద్వేగాలు వెల్లువెత్తిన వేళ, పదవ తరగతి టాపర్ల ప్రతిభను కొనియాడుతూ బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన "అమ్మా నాన్నకు ప్రేమతో" పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం అశేష జనవాహిని మధ్య కంటిపాపలాంటి జ్ఞాపకంగా నిలిచిపోయింది. ముఖంపై చిరునవ్వు, గుండెల్లో కాస్త భావోద్వేగం దాచుకుని మైక్ అందుకున్న సంధ్యారాణి.. తన ప్రాణసమానులైన ప్రజలకు, ఆడపడుచులకు, రేపటి భవిష్యత్తును మోసుకొచ్చిన విద్యార్థులకు హృదయపూర్వక వందనాలు అర్పిస్తూ, "మనం ఏ స్థాయికి ఎదిగినా నడిపించే శక్తులు జన్మనిచ్చిన అమ్మ, నూరేళ్ల భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమించే నాన్న మాత్రమేనని, నేటి పిల్లల విజయం వెనుక ఆ తల్లి కన్నీళ్లు, తండ్రి కష్టాలు దాగున్నాయని" సెంటిమెంట్‌ను పండించారు. ఈ అద్భుతమైన వేదికకు సరికొత్త ఐకానిక్ హుందాతనాన్ని తెచ్చిన ముఖ్య అతిథి, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ ప్రయాణం పిల్లలకు ఒక రోల్ మోడల్ అని, ఢిల్లీ స్థాయిలో సమాజ వెనుకబడిన వర్గాల గొంతుకగా నిలుస్తూ మన ప్రాంత పిల్లలను దీవించడానికి రావడం తమ అదృష్టమని ఆమె కొనియాడారు. కేవలం ఎన్నికల కోసమో, పదవుల కోసమో కాకుండా.. ఈ మట్టితో, ఇక్కడి ప్రజలతో గత 20 సంవత్సరాలుగా ఒక కూతురిగా, అక్కగా, చెల్లెలిగా సాగుతున్న తన పేగు బంధాన్ని గుర్తుచేసుకుంటూ సంధ్యారాణి కాస్త ఎమోషనల్ అయ్యారు. ఆనాడు కరోనా మహమ్మారితో ప్రపంచం వణికిపోతూ, కన్నవారిని ముట్టుకోవడానికి కూడా జనం భయపడిన చీకటి రోజుల్లో, ప్రాణాలకు తెగించి తాను చేసిన సేవలు పబ్లిసిటీ కోసం కాదని.. ఒక మహిళగా, తల్లిగా తన బాధ్యతగా భావించి చేశానని, ఆ క్లిష్టసమయంలో తన భర్త "కందుల పోషం" అందించిన తోడ్పాటు వల్లే ఆయన తనకు దేవుడిగా నిలిచారని కళ్లల్లో తడితో వివరించారు. ఆ అచంచలమైన నమ్మకమే నేడు తనను బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మీ ముందు నిలిపిందని, పదవులు వస్తుంటాయి పోతుంటాయి కానీ.. ఈ 20 ఏళ్లలో తాను సంపాదించుకున్న అతిపెద్ద ఆస్తి ప్రజల ప్రేమేనని స్పష్టం చేశారు. టెన్త్ క్లాస్ అనేది జీవితంలో ఒక మైల్‌స్టోన్ మాత్రమేనని, రేపు పిల్లలు ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు లేదా దేశాన్ని నడిపించే లీడర్లుగా ఏ లగ్జరీ కార్లలో తిరిగినా.. చేతులు అరిగేలా పనిచేసిన అమ్మానాన్నలను గుండెల్లో పెట్టుకోవడమే అసలైన గిఫ్ట్ అని మోడర్న్ యూత్‌కు హితవు పలికారు. పిల్లలకు చదువుతో పాటు సంస్కారాన్ని ఇవ్వాలని తల్లిదండ్రులను కోరుతూ, ఈ రోజు తామిచ్చే జ్ఞాపికలు కేవలం షీల్డ్‌లు కావు.. మీ భవిష్యత్తుకు గ్రీన్ సిగ్నల్స్ అని, పెద్దల ఆశీస్సులతో ఈ కందుల సంధ్యారాణి సామాజిక సేవ ఇలాగే కొనసాగుతుందని ప్రకటిస్తూ.. "జై హింద్.. భారత్ మాతా కీ జై" అంటూ కార్యక్రమంను ఉర్రూతలూగించారు..ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం, కన్స్ట్రక్షన్ అధినేత మాచిడి మహేందర్ , గాండ్ల రాములు, సూర్యదేవర జ్యోతి, బి ఎం ఎస్ నాయకులు సాగర్ రాజు సత్యనారాయణ రెడ్డి పెరిక సంఘం జిల్లా అధ్యక్షులు దుండె మల్లేష్, పోతరాజుల అంజయ్య మరియు బిజెపి సీనియర్ నాయకులు ముసుకుల భాస్కర్ రెడ్డి, తడగొండ నరసయ్య మండల అధ్యక్షులు ఊరగొండ అప్పర్ల ,గుండబోయిన భూమయ్య,బోడకుంట సుభాష్ ,మెరుగు నరేష్ గౌడ్,ఆకుల శశి మరియు నాయకులు కోడూరి రమేష్ ,జక్కన బాలు, జక్కుల పద్మ, కండె సాగర్, బూడిద హర్ష ,బియ్యాల మహేందర్, మీస వికాస్ ,సిలారపు కళ్యాణ్, పరకాల మురళి గౌడ్, అందె రాజ్ కుమార్ చారి,మూకిరి రాజు, ఎల్తూరి సరిత రాజయ్య, జక్కుల ప్రవీణ్, అనుమాండ్ల వెంకటేష్, గోపు రామన్న, కొలిపాక శంకరయ్య ,గోపతి ఐలేష్ దితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

- **పట్టణ కౌన్సిలర్లు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలి.**
- **సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.**
- **కోట్ల రూపాయలను వెచ్చించి పెద్దపల్లి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నాం.**
- **పట్టణ అభివృద్ధికి అందరూ సహకరించాలి.**
- **రూ. 7 కోట్లతో పట్టణ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్.**
- **ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు.**




**డిడి9వార్త / పెద్దపల్లి జూన్ 11:**

పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మరియు పట్టణ కౌన్సిలర్లతో కలిసి పారిశుధ్యం, త్రాగునీరు, వీధి దీపాలు, సీజనల్ వ్యాధులు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు ఇతర అంశాలపై మున్సిపల్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ..ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ..మున్సిపల్ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పారిశుధ్యంపై దృష్టి సారించాలని పట్టణ కౌన్సిలర్లు నిత్యం ప్రజల మధ్య ఉంటూ వార్డుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచనలు చేశారు. పెద్దపల్లి పట్టణంలో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్లు, మంచి నీటి ట్యాంకుల నిర్మాణాలు, రూ. 7 కోట్లతో నూతన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, అమృత్ 2.0 పతకం, మరుగుదొడ్లు మరియు అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వాటన్నింటిటీ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రానున్న కొద్ది రోజుల్లో పట్టణంలో వార్డు వార్డున క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని తెలిపారు. ప్రతి వార్డులో పారిశుధ్యం మరింత మెరుగుపరిచేలా కమిషనర్ మరియు చైర్మన్ చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాలు ఎన్ని చేపట్టినా వాటిని పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యం చేసే దిశగా అధికారులు మరియు ప్రజాప్రతినిధులు చూడాలని కోరారు. పట్టణంలో దాదాపు 77 కోట్ల పై చిలుకు నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, చైర్మన్, వైస్ చైర్మన్, పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు మరియు పాల్గొన్నారు.

# మణుగూరు గడ్డపై విప్లవ కార్మిక సంఘం నాయకునిగా చెరగని ముద్ర వేసిన కా. మిడిదొడ్ల నాగేశ్వరరావు సేవలు చిరస్మరణీయం..

- జి.ఎల్.బి.కె.ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.డి. నాసర్ పాషా.
- కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో కొండాపురం సి.హెచ్.పి లో కా. నాగేశ్వరరావు సంతాప సభ.



మణుగూరు.జూన్ 10
(డి డి 9వార్త)

తాను నమ్మిన సిద్ధాంతం కోసం 28 ఏళ్లపాటు విప్లవ కార్మిక నాయకునిగా మణుగూరు గడ్డపై చెరగని ముద్ర వేసిన కామ్రేడ్ మిడిదొడ్ల నాగేశ్వరరావు సేవలు చిరస్మరణీయమని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (జి.ఎల్.బి.కె.ఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.డి. నాసర్ పాషా అన్నారు.సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐ.ఎఫ్.టి.యు) ఆధ్వర్యంలో కొండాపురం సి.హెచ్.పి, రైల్వే సైడింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ అడ్డా, రామాలయం అడ్డా వద్ద జరిగిన కా. మిడిదొడ్ల నాగేశ్వరరావు సంతాప సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారునిగా మోటార్ వర్కర్స్ యూనియన్, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకుడిగా, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఏరియా నాయకుడిగా ప్రజా సమస్యల పట్ల అంకితభావంతో పనిచేసిన నాగేశ్వరరావు, మలిదశ తెలంగాణ ఉద్యమంలో కూడా జెఎసి నాయకుడిగా చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. పార్టీకి, ప్రజలకు, కార్మికులకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు కోసం జెఎసి ఆధ్వర్యంలో జరిగిన 18 రోజుల చారిత్రాత్మక సమ్మెలో కన్వీనర్‌గా ఆయన పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. ఆయన ఆశయ సాధనకై ప్రతి ఒక్కరం ఐక్యంగా ముందుకు కదలాలని, అదే కామ్రేడ్‌కు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. అనంతరం నాగేశ్వరరావు మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. "కామ్రేడ్ నాగేశ్వరరావు అమర్ రహే!" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధ్యక్షులు ఆంగోత్ మంగీలాల్, బెల్ట్ క్లీనింగ్ సూపర్‌వైజర్లు టి. లక్ష్మీనారాయణ, బి. నగేష్, బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు,



పారిశుధ్య కార్మికులు వై. సంజీవరావు, పి. వెంకటేశ్వర్లు, నాగరాజు,టిక్య, కృష్ణ, లక్ష్మణ్, వీరయ్య, మురళి, జానయ్య, సాంబయ్య, ఆర్. లింగయ్య, అరుణ, లక్ష్మి, జి. శ్రీనివాసరావు, నర్సయ్య, రామకృష్ణ, వెంకటేశ్వర్లు,రమణ, శ్రీలత, ఉపేంద్ర, మంగ, నరసింహారావు, కారం భీమయ్య, నాగేశ్వరావు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# రూ.9.90 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం, ఐదుగురు వ్యక్తుల అరెస్టు



భద్రాచలం, జూన్ 10 , డిడి9 వార్త

భద్రాచలంలో బుధవారం స్థానిక కూనవరం రోడ్డులో ఎక్సైజు ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు వాహన తనిఖీలు చేసిన సమయంలో మూడు ద్విచక్రవాహనాలను తనిఖీ చేయగా రూ.9.90 లక్షలు విలువ చేసే 13.600 కిలోల గంజాయిని పట్టుకోవడంతో పాటు ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజు ఎన్‌ఫోర్సుమెంటు ఎస్సై సీహెచ్ శ్రీహరిరావు తెలిపారు. ఉదయం కూనవరం రోడ్డులోని ఇసుక రీచ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఒక ద్విచక్ర వాహనంను ఆపి తనిఖీ చేయగా 8.800 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. ఈ గంజాయిని తరలిస్తున్న కర్నూలు జిల్లా మునగాలపాడుకు చెందిన షేక్ అజ్మతుల్లా, గంగాధర్ హాన్‌లను అరెస్టు చేసారు. అలాగే మరో ద్విచక్ర వాహనంలో 2.200 కిలోల ఎండు గంజాయి లభ్యమవగా నల్గొండ జిల్లా పానగల్లుకు చెందిన కోడదల అజయ్‌కుమార్, నల్గొండ జిల్లా బొంకూరు లోకేష్‌ను అరెస్టు చేసారు. అలాగే మూడో వాహనంలో 3.100 కిలోల గంజాయి లభ్యం కాగా ఒడిశాలోని మల్కనగిరికి చెందిన నిమాచంద్ అధికారిని అరెస్టు చేశారు. ఈ మూడు వాహనాల్లో ఉన్న గంజాయిని ఒడిశాలోని మల్కనగిరి జిల్లా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తూ పట్టుబడ్డారు. పట్టుబడిన గంజాయి మొత్తం 13.600 కిలోలు ఉండగా, గంజాయి మార్కెట్ ధర రూ.9.90 లక్షలు ఉంటుందని ఎక్సైజు అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్స్ పి. రాజు, రమేశ్ బాబు, వెంకన్న, ప్రసన్నకుమార్, ఉపేందర్‌లు తదితరులు పాల్గొన్నారు.

# పినపాక మండలం ఐలాపురం బ్రిడ్జి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..

- ఇద్దరు యువకులు దుర్మరణం.

మణుగూరు.జూన్ 10
(డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఐలాపురం బ్రిడ్జి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు టిప్పర్ లారీని ఢీకొన్నట్లు ప్రాథమిక సమాచారం .ఈ ప్రమాదంలో మణుగూరు సమీపంలోని కమలాపురం గ్రామానికి చెందిన దర్రాజు కిషోర్ అక్కడికక్కడే మృతి





చెందినట్లు సమాచారం. మరో యువకుడు ప్రశాంత్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిసింది.



ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.



ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.



# భద్రాద్రి రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం

- నిత్యన్నదాన పథకంకు రూ.లక్ష విరాళం

భద్రాచలం టౌన్ , జూన్ 10

భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి వారి ఆలయంలో బుధవారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకదారణ, జీలకరబెల్లం, మాంగల్యాదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంను వైదిక బృందం నిర్వహించారు. అనంతరం కల్యాణంలో పాల్గొన్న వారికి స్వామి వారి మూలవరుల దర్శనంతో పాటు ఉచిత అన్నదాన ప్రసాదం స్వీకరించారు. అదేవిధంగా దేవస్థానం నిత్యన్నదాన పథకంకు భద్రాచలంకు చెందిన అడవి వెంకటశేష చలపతి దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు.

# నేడు గోవిందరావుపేటలో మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు పర్యటన

- కిసాన్ మేళాను విజయవంతం చేయాలి.

గోవిందరావుపేట, జూన్ 10(డి డి 9వార్త)



ములుగు జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల కోసం నిర్వహిస్తున్న కిసాన్ మేళా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ కోరారు. గురువారం ఉదయం 9 గంటలకు గోవిందరావుపేట మండల కేంద్రంలోని సోమల గడ్డ క్రాస్ రోడ్ సమీపంలోని పి.ఎస్.ఆర్. గార్డెన్స్‌లో కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి,గ్రామీణ నీటి పారుదల, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి, సీతక్క హాజరుకానున్నారు. అలాగే ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ కూడా పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై మంత్రులకు ఘన స్వాగతం పలికి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాలడుగు వెంకటకృష్ణ పిలుపునిచ్చారు.

# సర్పంచ్ దేవునూరి సతీష్ ఆధ్వర్యంలో ఎల్లంల గ్రామసభ

జనగామ జూన్ 10(డిడి 9వార్త)
బ్యూరో

జనగామ జిల్లా ఎల్లంల గ్రామపంచాయతీలో సర్పంచ్ దేవునూరి సతీష్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. గ్రామ కార్యదర్శి లక్కవత్ సంతోష్ ప్రభుత్వ మార్గదర్శకాలను వివరించగా, వార్డు సభ్యులు ఎదునూరి ప్రదీప్, దండు చిరంజీవి, బాలయ్య లక్ష్మి, గాదేపాక మధు గ్రామ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సర్పంచ్ దేవునూరి సతీష్ పిలుపునిచ్చారు.



## పచ్చదనానికి శ్రీకారం చుట్టిన "పస్రా" పోలీసు అధికారులు

గోవిందరావుపేట, జూన్ 10 (డి డి 9 వార్త)

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పస్రా గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభ అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పస్రా సీఐ దయాకర్, ఎస్సై తాజుద్దీన్, సర్పంచ్ సుమలత, ఉపసర్పంచ్ సంజన మొక్కలు నాటి హరిత కార్యక్రమాన్ని చేపట్టారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి పౌరుడి బాధ్యత అని వారు పేర్కొన్నారు.

పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత అవసరమని, భావి తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపే కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.





## భద్రాచలం ఏరియా ఆసుపత్రిని సీఎం స్వయంగా సందర్శించాలి

- ఏజెన్సీ వైద్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం – సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
- ప్రభుత్వ వైద్య సమస్యలపై ఆగస్టులో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ

భద్రాచలం , జూన్ 10 ,డిడి9 వార్త

భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సందర్శించి ఇక్కడ అందుతున్న వైద్యాన్ని చూడాలని సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం బృందం ప్రభుత్వ ఏరియా వైద్యశాలని సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు రోగులతో మాట్లాడిన జాన్ వెస్లీ వారికి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. అనంతరం ఏరియా ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడిన జాన్ వెస్లీ ఏజెన్సీ వైద్యంపై ప్రభుత్వం చిన్నచూపు చూపిస్తోందని ఆరోపించారు. నాలుగు రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న భద్రాచలం ఆసుపత్రికి ప్రతిరోజు 400 నుండి 600 వరకు రోగులు వస్తున్నారని, ఆ స్థాయిలో రోగులున్న ఆసుపత్రికి కేవలం 19 మంది వైద్యులే ఉండటం శోచనీయమన్నారు. 55 మంది నర్సింగ్ సిబ్బందికి కేవలం 15 మంది మాత్రమే ఉన్నారని అన్నారు. సగానికి పైగా ఖాళీలు ఉంటే వాటిని పూరించాల్సిన పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అత్యాధునిక వైద్య పరికరాలు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది లేక పేదవాడికి ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షాల మిగిలిపోతుందని జాన్ వెస్లీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య పనులు నిర్వహించే శానిటేషన్ కార్మికులకు సైతం చాలీచాలని వేతనాలు సకాలంలో అందటం లేదని అన్నారు. జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సందర్శించిన పాపాన్ని పోలేదని జాన్ వెస్లీ విమర్శించారు. సిపిఐ ఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యం పై అధ్యయనం చేస్తున్నామని ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ఆగస్టు మాసంలో హైదరాబాదులో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రత్యేకించి భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సిబ్బంది కొరతపై త్వరలోనే సిపిఐ ఎం బృందం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు సున్నం గంగా పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు డి సీతాలక్ష్మి సంతోష్ 20వ వార్డు నెంబర్ ఇరుప అనసూర్య పట్టణ నాయకులు నాదెల లీలావతి కొలగాని రమేష్ దొనకొండ రాఘవయ్య కనక శ్రీ చట్ట శ్రీనివాసరావు కోరాడ శ్రీను సంద్ర ఉపేంద్ర కుంజా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ

జనగామ జూన్ 10(డిడి 9వార్త) బ్యూరో

జనగామలో 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమంలో డీజీపీ అనిల్ కుమార్ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమని అనిల్ కుమార్ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో జనగామలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనల పాటన ద్వారానే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. గత ఆరు నెలలుగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ఫలితంగా వరంగల్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు 15 శాతం తగ్గినట్లు తెలిపారు. ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

కార్యక్రమంలో సన్ ప్రీత్ సింగ్, పోలీసు ఉన్నతాధికారులు, ఆర్టీసీ సిబ్బంది, యువత పాల్గొన్నారు. ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు అందజేయడంతో పాటు యువతకు హెల్మెట్లు, ఆటో డ్రైవర్లకు కంటి అద్దాలు పంపిణీ చేశారు.



# గండిపేట్ కాలువకు గండం

- కబ్జాదారులకు అధికారుల అండా.?
- సర్వే నం.327లో కాలువను పూడ్చి నిర్మాణాలు
- వర్షా లు వస్తే మంచిరేవులకు ముంపు తప్పదా..?
- కళ్లముందే ఆక్రమణలు - అయినా స్పందించని,టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు

రాజేంద్రనగర్ జూన్ 10 డిడి 9 వార్త

గండిపేట్ చెరువు నుంచి ప్రవహించే ప్రధాన వరద కాలువపై జరుగుతున్న ఆక్రమణలు అధికార యంత్రాంగం పనితీరుపై తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయి.గండిపేట్ మండలం మంచిరేవుల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 327లో కాలువ భూమిని

వీరన్న గుట్ట మచిలేశ్వర స్వామి సాక్షిగా మూసీ నది కబ్జా చేసి దర్జాగా,ది బాంబిని క్రీక్ నేచర్ ఇన్స్పైరెడ్ ప్రెస్కూల్ కు సంబంధించి భారీ నిర్మాణ పనులు సాగుతున్నా సంబంధిత శాఖలు మౌనం పాటించడం విమర్శలకు దారితీస్తోంది. వరద నీటి ప్రవాహానికి కీలకమైన కాలువను మట్టితో పూడ్చివేస్తూ ప్రైవేట్ విద్యాసంస్థకు సంబంధించిన నిర్మాణం చేపడుతున్నారు. సహజ జలమార్గాన్ని అడ్డుకుంటూ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు ఇప్పటి వరకు ఒక్కసారి కూడా క్షేత్రస్థాయిలో తనిఖీ చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.వర్షాకాలం ముంచుకొస్తున్న వేళ కాలువ వెడల్పు కుదించబడితే మంచిరేవుల గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలు ముంపు బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. గతంలో చెరువులు,కాలువల ఆక్రమణల కారణంగా నగరంలో అనేక ప్రాంతాలు జలదిగ్బంధానికి గురైన ఉదంతాలు ఉన్నప్పటికీ అధికారులు పాఠాలు నేర్చుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రజా ఆస్తిని ఆక్రమించి నిర్మాణాలు సాగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నా టౌన్ ప్లానింగ్,రెవెన్యూ,ఇరిగేషన్ శాఖలు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆక్రమణదారుల వెనుక రాజకీయ లేదా అధికార పలుకుబడి ఉందా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూములు, కాలువలు,చెరువులు కాపాడాల్సిన అధికారులే మౌన ప్రేక్షకులుగా మారితే ప్రజల ప్రాణాలు ,ఆస్తులకు బాధ్యత ఎవరిదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే సంయుక్త సర్వే నిర్వహించి కాలువ అసలు హద్దులను గుర్తించాలని,ఆక్రమణలను కూల్చివేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వర్షాలు ప్రారంభమైన తర్వాత చర్యలు తీసుకోవడం కాదు, ముంపు ముప్పు రాకముందే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.లేకపోతే రేపు ఏదైనా విపత్తు జరిగితే దానికి ఆక్రమణదారులతో పాటు నిర్లక్ష్యం వహించిన అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.



